క్లుప్తంగా

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు

గుడివాడరూరల్: రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను చేపట్టాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ అధికారులను ఆదేశించారు. గుడివాడ మార్కెట్‌యార్డ్, తటివర్రు గోడౌన్‌లను ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ తుపాను నేపథ్యంలో నూర్పిళ్లు చేసి కల్లాలు, రోడ్ల వెంబడి ఉన్న ధాన్యాన్ని కాపాడుకునేందుకు పాలిథిన్ కవర్లను రైతులకు అందించేందుకు గుడివాడకు 100 కేటాయించామన్నారు. వ్యవసాయశాఖ ఏడీఏ రమాదేవి, ఏఓ అనంతలక్ష్మి, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, పీడీఎస్ డీటీ కిరణ్, ఆర్ఐ నాగబాబు పాల్గొన్నారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో 'అక్షర'కు చోటు



మండవల్లి: మండవల్లికి చెందిన పసుపులేటి అక్షర ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. అక్షర కైకలూరు నేషనల్ స్కూల్లో మూడో తరగతి చదువుతోంది. తండ్రి పసుపులేటి శివకృష్ణ, తల్లి లక్ష్మీ ప్రసన్న ప్రభుత్వ ఉద్యోగులు. అక్షర యూకేజీలో ఉన్నప్పుడు దేశంలోని కేంద్ర పాలిత ప్రాంతాలు, వాటి రాజధానులు కేవలం 40 సెకన్లలో చెప్పడం, అబాకస్‌లోనూ ప్రతిభ కనబరచేది. రసాయనిక శాస్త్రంలోని ఆధునిక పీరియాడిక్ టేబుల్‌లోని 118 మూలకాలను కేవలం 55 సెకండ్లలోనే చెబుతుంది. ఈ విషయాన్ని ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారికి తెలియజేయగా, ఒక రికార్డుగా గుర్తించి ఐబీఆర్ అచీవర్ (ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ అచీవర్) అవార్డును, మెడల్, సర్టిఫికేట్‌ను ప్రదానం చేశారు.

అనారోగ్య బాధితులను ఆదుకుంటాం



పామర్రు: అనారోగ్య బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. స్థానిక కార్యాలయంలో నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన బాధిత కుటుంబాలకు శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 39 మంది బాధితులకు రూ.20,87,004లను చెక్కుల రూపంలో అందించామన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, నాయకులు ప్రవీణ్‌చంద్ర, గణేష్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

మతం మారితే కులం మారదు

గుడివాడరూరల్: మతం మారితే కులం మారదని రాజ్యాంగంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పొందుపర్చారని దళిత సంఘాల నాయకుడు పొంగులేటి జయరాజు అన్నారు. స్థానిక రాజేంద్రనగర్‌లో దళిత సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మతం మారినంత మాత్రాన కులం మారదని రాజ్యాగంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆర్టికల్–25లోని 341లో తెలిపారన్నారు. మతం మారిన వారిని ఎస్సీలు బీసీలుగా న్యాయస్థానాల్లో తీర్పులు ఇవ్వడం సమంజసం కాదన్నారు. సమావేశంలో దళిత నాయకులు సుధాకర్, కరుణాకర్, విజయబాబు, మధుబాబు, అనిల్, పాస్టర్లు ధనరాజ్, ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాలకు అండగా నిలవండి



కైకలూరు: సమాజంలో యాదవులు సంఘ ఐక్యతను చాటుకుంటూ బలహీన వర్గాలకు అండగా నిలవాలని గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. స్థానిక సీఏన్నార్ గార్డెన్‌లో నియోజకవర్గ శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం కార్తిక వనసమారాధన శనివారం నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు కరేటి శ్రీహరి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో మంత్రి మాట్లాడారు. యాదవ ప్రముఖులు కారుమూరి నాగేశ్వరరావు, సునీల్‌కుమార్, జంగా కృష్ణమూర్తి, లాకా వెంగళరావు, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి కొల్లేటికోట పెద్దింట్లమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.

షాదీఖానాకు శంకుస్థాపన

గుడ్లవల్లేరు: డోకిపర్రులో షాదీఖానా నిర్మాణ పనులకు పీఏసీఎస్ మాజీ చైర్మన్ వీరమాచినేని శివప్రసాద్ చేతుల మీదుగా శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ముస్లిం నేతలు షేక్ జానీ, మహబూబ్ చిన్నా, జిలాని, బాజీ, కరీంబేగ్, మస్తాన్ బాబు, దాదా, ఖాదర్ బేగ్, గౌసి పాల్గొన్నారు.

అన్నదాతకు అందని ప్రభుత్వ సహకారం

- తుపాను ప్రభావంతో ఆందోళనలో రైతులు
- పట్టించుకోని అధికారులు

తుపాను ప్రభావం అన్నదాత గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తోంది. ఖరీఫ్ సాగు ప్రారంభం నుంచి ఆటుపోట్లకు గురవుతున్న రైతులకు వరి సాగు శాపంలా మారింది. పంట చేతికి అందివచ్చే సమయంలో మరో తుపాను రైతులను కలవరపెడుతోంది. ప్రభుత్వం నుంచి రైతులకు సహకారం అందకపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ధాన్యం కొనుగోళ్లలోనూ అధికార పార్టీ నేతల జోక్యంతో రైతులు ధాన్యం విక్రయించేందుకు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది.



ధాన్యాన్ని వర్షం నుంచి కాపాడుకునేందుకు పట్టాలు కప్పుతున్న రైతు

గుడివాడరూరల్: ధాన్యం కల్లాల్లో, రోడ్ల వెంబడి రోజుల తరబడి ఉన్నా సంచులు సకాలంలో అందకపోవడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. వాస్తవంలో మాత్రం ఎటువంటి సౌకర్యాలు అందకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని గుడివాడలో 14,675 ఎకరాలు, గుడ్లవల్లేరులో 22,493, నందివాడ మండలంలో 4,262 ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఖరీఫ్ ప్రారంభ దశలోనే తుపాను, వరదలతో పంట పొలాలు ముంపు బారిన పడి రైతులకు నష్టాన్ని కలిగించాయి. రైతులు నష్టాన్ని భరించి ఖరీఫ్‌లో మళ్లీ సాగుకు ఉపక్రమించారు.

నిబంధనలతో రైతులకు నష్టం

పంట చేతికందే సమయంలో ఒక పక్క తుపాను, మరో పక్క కొనుగోలు నిబంధనలు రైతన్నలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ప్రభుత్వం ధాన్యం బస్తాకు రూ.1,725 మద్దతు ధర ప్రకటించినా తేమశాతం రూపంలో మిల్లర్లు, అధికారులు అడ్డగోలు నిబంధనల పేరిట ధరలకు తూట్లు పొడుస్తున్నారు. ధర తగ్గించి బస్తా కేవలం రూ.1,200 నుంచి రూ.1,400కు మాత్రమే చెల్లించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇంత జరుగుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

నష్టపోతున్న కౌలు రైతు

వరిసాగులో అధిక భాగం సాగు చేసేది కౌలు రైతులే. ఆరుగాలం కష్టపడి సాగుచేసినా ఫలితం మాత్రం నిరాశజనకంగానే ఉంది. కౌలు రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని ప్రభుత్వం చెబుతున్న మాటలు నీటిమూటలుగానే మిగులుతున్నాయి. తుపాను, భారీ వర్షాలతో పంటలు దెబ్బతిన్నా సాగు చేసిన కౌలురైతులకు ప్రభుత్వం సాయం అందడం లేదు. దీంతో అప్పులు చేసి పెట్టుబడి పెట్టి పంటలు పండించే కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమను ఆదుకోవాలని కౌలు రైతులు వేడుకుంటున్నారు.

సంచులు నిల్

ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులకు కావాల్సిన సంచుల సరఫరా సక్రమంగా జరగకపోవడంతో సంచులు అందక రైతన్నలు ధాన్యాన్ని కల్లాలు, రోడ్ల వెంబడి రోజుల తరబడి నిల్వ ఉంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వాస్తవానికి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి సంచులు సరఫరా, కల్లాల్లో ధాన్యాన్ని సంచుల్లో నింపడం, తూకం వేయటం, సంచులు కుట్టడం, బస్తాలను లారీలో లోడ్ చేసేందుకు అయ్యే ఖర్చులను ప్రభుత్వమే భరించాలి. వాస్తవ రూపంలో అటువంటి సౌకర్యాలు లేకపోవడంతో రైతన్నలు పంట చేతికి వచ్చే సమయంలో సమస్యలతో సతమతమవుతున్నారు. ధాన్యం కొనుగోళ్లలోనూ అధికార పార్టీ చోటామోటా నాయకులు తలదూర్చి తమ సొంతవారికే ప్రభుత్వ సౌకర్యాలు కల్పించి, మిగతా వారికి అన్యాయం చేయడంతో కొనుగోళ్లలో సైతం నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.

సంచులు సరఫరా చేయడం లేదు



నేను 25 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశాను. మొదటి నుంచి కోతలు పూర్తయ్యే వరకు ఎకరాకు రూ.25వేల నుంచి రూ.30 వేలు ఖర్చు పెట్టాను. కల్లం నుంచి ధాన్యాన్ని రహదారి పక్కకు చేర్చి వారం రోజులు అయినా సంచులు సరఫరా చేయలేదు. రవాణా సౌకర్యాన్ని అధికారులు కల్పించడం లేదు. ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. పంట నష్టపోతే ఆత్మహత్యలే శరణ్యం.

– హరికృష్ణ, కౌలు రైతు, లింగవరం

సౌకర్యాలు లేవు



ధాన్యాన్ని తరలిద్దామంటే సరైన సౌకర్యాలు లేవు. సంచులు, లారీలు సకాలంలో ఏర్పాటు చేయకపోవడంతో వారం రోజుల నుంచి రోడ్ల వెంబడి ధాన్యాన్ని నిల్వ ఉంచి పడిగాపులు పడుతున్నా. అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. సంచులు లేవని సమాధానం చెబుతున్నారు. రోడ్ల మీదే ధాన్యం ఉంది. తుపాను ప్రభావంతో వర్షం పడుతోంది. సంచులు ఇవ్వకపోతే తీవ్రంగా నష్టపోతాం. సౌకర్యాలు కల్పించి అధికారులు పుణ్యం కట్టుకోండి.

– ఫణి, కౌలు రైతు, లింగవరం

సంచులు అందుబాటులో ఉన్నాయి

ధాన్యం తరలించేందుకు సంచులు అందుబాటులో ఉన్నాయి. రవాణా సౌకర్యాన్ని కూడా కల్పిస్తాం. రైతులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే మా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తాం. ధాన్యాన్ని వీలైనంత త్వరగా తరలించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నాం.

– వి.రామకోటేశ్వరరావు, తహసీల్దార్

వర్షాలతో రైతుల ఆందోళన

పామర్రు: తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో ఆరుగాలం కష్టించి పండించిన వరి పంట తమ దాకా వస్తుందా లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. పామర్రు మండలంలో శనివారం తెల్లవారు జామునుంచి వర్షం కురుస్తోంది. దీంతో పంట నూర్చుకుని ధాన్యాన్ని రోడ్లపైన ఆరబెట్టుకున్న రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఉన్న మిల్లర్లు తమ ధాన్యాన్ని తీసుకునేందుకు అనేక కారణాలు చెబుతున్నారని అంటున్నారు. తేమ శాతం ఉన్నందున బస్తాకు రూ.1,300 వరకు మాత్రమే వస్తుందని అధికారులు చెబుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు ఎక్కువగా కురిస్తే టార్పాలిన్ పట్టాలు కూడా ఆగవని ధాన్యం మొత్తం తడిసి పోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు.

■ తూర్పుగోదావరి జిల్లా నుంచి లారీలు

స్థానికంగా నూర్చిన ధాన్యాన్ని ఇక్కడి మిల్లర్లు సక్రమంగా తీసుకోకపోవడం, మిల్లర్లు లారీలను అన్‌లోడ్ చేసుకోక పోవడంతో స్థానికంగా లారీల కొరత ఏర్పడింది. దీంతో తూర్పు గోదావరి జిల్లా నుంచి 10లారీలను రప్పించి వాటి ద్వారా ధాన్యం ఎగుమతులు చేస్తున్నట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

■ రైతులకు కునుకు లేదు

మొవ్వ: తుపాను ప్రభావంతో మండలంలో కురుస్తున్న వర్షాలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. శనివారం మొవ్వ మండలంలో కురుస్తున్న వర్షానికి తోడు ఈదురు గాలులు తోడయ్యాయి. ధాన్యం రోడ్డుల పైనే రాశులుగా, సంచుల్లోకి ఎత్తిన రైతులు దిక్కు తోచని స్థితిలో పట్టాలు కప్పుకున్నారు. కోత కోయని పొలాలు నేలకు ఒరిగి చాపలను తలపిస్తున్నాయి.

■ రైతుల అగచాట్లు

గుడ్లవల్లేరు: మండలంలో కురిసిన వర్షంతో రైతులు అగచాట్లకు గురయ్యారు. శనివారం కురిసిన వర్షానికి రైతులు తాము పండించిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తోలేందుకు తంటాలు పడ్డారు. కొన్ని పొలాలు కోత దశకు వచ్చి పడకేయటంతో వర్షం కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుధారాణి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుధారాణి

గుడివాడరూరల్: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని గుడివాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.సుధారాణి పేర్కొన్నారు. స్థానిక గురురాజు హోమియోపతి కళాశాల్లో మండల న్యాయసేవా సాధికారిక కమిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్జి సుధారాణి మాట్లాడుతూ బాల్య వివాహాలతో బాలికలు చిరుప్రాయంలోనే ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఎయిడ్ వ్యాధి గ్రస్తులను చిన్నచూపు చూడకుండా అందరితో కలసిమెలసి ఉండేలా చూడాలన్నారు. మత్తు పదార్థాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలన్నారు. కళాశాలలు, ఇతర ప్రాంతాల్లో ర్యాగింగ్‌కు ఎవరైనా పాల్పడితే సంబంధిత అధికారులకు తెలియపర్చాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు సీహెచ్ కుటుంబరావు, ఎంవీ సౌధామణి, బి.విమలాదేవి, ఓ.శివరామకృష్ణ, సీహెచ్ సాయిగణేష్ తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ క్రీడాకారుల ప్రతిభ

జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందన



పతకాలు సాధించిన క్రీడాకారులతో స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి తదితరులు

గుడివాడరూరల్: గుంటూరు జిల్లా మంగళగిరిలో ఈ నెల ఆరు నుంచి ఎనిమిదో తేదీ వరకు జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్ షిప్ స్కేటింగ్ పోటీల్లో గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం క్రీడాకారులు 52 మంది ప్రతిభ చూపి బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారు. 16 మంది స్టేడియం స్కేటింగ్ క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అదేవిధంగా జాతీయ స్థాయి స్కేటింగ్ కోచ్‌గా ఎంపికైన స్టేడియం కోచ్ రాజును, పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్ శనివారం స్టేడియం ప్రాంగణంలో అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా యలవర్తి మాట్లాడుతూ డిసెంబర్ 5వ తేది నుండి 15వ తేదీ వరకు కోయంబత్తూరులో జరిగే నేషనల్ చాంపియన్ షిప్ రోలర్ స్కేటింగ్ పోటీలకు వివిధ విభాగాల్లో 16మంది స్టేడియం క్రీడాకారులు ఎంపిక కావడం సంతోషకరమన్నారు.

సంక్షిప్త వార్తలు

■ దరఖాస్తుల ఆహ్వానం

పెదపారుపూడి: మండలంలో నాలుగు రేషన్ షాపుల డీలర నియామకానికి నోటిఫికేషన్ విడుదలైనట్లు తహసీల్దార్ వై.రంగరావు శనివారం తెలిపారు. మండలంలోని అప్పికట్ల గ్రామంలో–1, వెంట్రప్రగడలో–2, భూషణగుళ్లలో–1 చొప్పున రేషన్ షాపులకు డీలర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్ పాసై ఉండి, 18–40 మధ్య వయసు కలిగి ఉండాలని తెలిపారు.

■ కోతలను నిలుపుదల చేయండి

కైకలూరు: తుపాను నేపథ్యంలో రైతులు వరి కోతలను నిలుపుదల చేయాలని ఇన్‌చార్జి తహసీల్దారు ఇబ్రహీం, ఏఓ ఆర్.దివ్య సూచించారు. రాచపట్నం, వేమవరప్పాడు, తామరకొల్లు, గోపవరంలో వరి పొలాలను శనివారం పరిశీలించారు. పలు గ్రామాల్లో వరి బస్తాలను తహసీల్దారు ట్రాక్టర్లపై మిల్లులకు తరలించారు.

■ 7న ఎంపీటీఎం సమావేశం

మండవల్లి: మండలంలోని పుట్లచెరువు జెడ్పీ ఉన్నత పాఠశాల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం (ఎంపీటీఎం) ఈ నెల ఏడో తేదీన నిర్వహించనున్నట్లు హెచ్ఎం అంబటి వెంకట నాగేశ్వరరావు శనివారం తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులు ఎంపీటీఎం అక్షరాల రూపంలో ప్రదర్శన ఇచ్చి ఆకట్టుకున్నారు.

అన్నదానం

■ గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవా భవన్‌లో శనివారం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ గుడ్లవల్లేటి లక్ష్మణరావు జయంతిని పురస్కరించుకుని వారి కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో నిర్వహించినట్లు లయన్స్ చైర్మన్ శశికళ తెలిపారు.

■ 95 శాతం పింఛన్ల పంపిణీ

గుడ్లవల్లేరు: మండలంలో 95 శాతం మేరకు పింఛన్లను లబ్ధిదారులకు అందజేసినట్లు ఎంపీడీఓ విజయసారథి శనివారం తెలిపారు. ఉదయం 10 గంటల తర్వాత కొద్ది మేరకు సర్వర్ సమస్య వచ్చినా సిబ్బంది ఇబ్బంది పడకుండానే పింఛన్ల పంపిణీని చేశారన్నారు.

■ విద్యుత్ మోటార్ల దొంగల ముఠా అరెస్ట్

నందివాడ: మండలంలో విద్యుత్ మోటార్ల చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ, సోమేశ్వరరావు, ఎస్ఐ కె.శ్రీనివాస్ తెలిపారు. శనివారం నిందితుల వివరాలను పోలీసులు వెల్లడించారు. నిందితుల నుంచి మోటార్ సైకిల్, కారు, 34 విద్యుత్ మోటార్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులు జి.శ్యామ్‌ప్రవీణ్ కుమార్, జి.శశికుమార్, డి.రాంబాబు, అస్మతుల్లా బేగ్ వ్యసనాలకు అలవాటుపడి, సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో తప్పు దోవను ఎంచుకున్నారన్నారు.

■ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కైకలూరు: యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని కైకలూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ సీఐ ఎస్‌కే రమేష్ సూచించారు. మాదక ద్రవ్యాల వాడకంపై వచ్చే అనర్థాలపై కైకలూరు విజ్ఞాన్ డిగ్రీ కాలేజీలో శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐ రమేష్ మాట్లాడుతూ డ్రగ్స్ విక్రయాలపై ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఎక్సైజ్ ఎస్సైలు ఆదినారాయణ, అలీం పాల్గొన్నారు.

■ ఉచితంగా వైద్య పరీక్షలు

గుడివాడరూరల్: లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ గుడివాడ ప్రగతి ఆధ్వర్యంలో ఉచితంగా మధుమేహ వైద్య పరీక్షలు నిర్వహించినట్లు స్పెక్ట్రమ్ డాక్టర్ కడియాల ప్రణీత్, నిషాలి శనివారం తెలిపారు. గుడివాడ పరిసర ప్రాంతాల్లో 20 రోజులుగా 650 మందికి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు.

■ జూదరుల అరెస్ట్

వెంట్రప్రగడ(పెదపారుపూడి):మండలంలోని వెంట్రప్రగడ శివారు లక్ష్మీపురంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శనివారం దాడి చేసి, జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకుని, రూ.3 వేలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా చండీ హోమం



గుడివాడరూరల్: పట్టణంలోని మెయిన్‌రోడ్డులో ఉన్న శ్రీవిఘ్నేశ్వరస్వామి ఆలయంలో కార్తికమాసం ముగింపు సందర్భంగా శనివారం శ్రీలక్ష్మీగణపతి చండీ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. దేవస్థానం కమిటీ చైర్మన్ శాయిన రాజేష్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కార్తికమాసం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో చండీ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ యార్లగడ్డ వాసు తదితరులు పాల్గొన్నారు.

భక్తి గీతాల పోటీలు



గుడ్లవల్లేరు: వాగ్గేయకారుడు త్యాగరాజు స్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా ఆయనకు సంబంధించిన భక్తి గీతాల పోటీలను స్థానిక శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం నిర్వహించారు. ప్రపంచ బ్యాంకు ప్రాజెక్ట్ మయన్మార్ సత్తిరాజు సుందర శివరావు, పద్మశ్రీ డాక్టర్ అన్నవరపు రామస్వామి అతిథులుగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక పాఠశాలల విద్యార్థినులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. తొలుత స్వర్గీయ డాక్టర్ గుడ్లవల్లేటి లక్ష్మణరావుచే ప్రతిష్ఠించిన త్యాగరాజ విగ్రహానికి ఆలయ పండితుడు డాక్టర్ అగ్నిహోత్రం ఫణిగోపాల్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జీఈసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కరుణకుమార్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితులను ఆదరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సుమ

మండవల్లి: మండవల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కైకలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేమపాటి సాయి సత్యనారాయణ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాప్తి– నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ సుమ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ బాధితులకు మానసిక స్థైర్యాన్ని కలిగించి వారిని ఆదరించాలన్నారు. న్యాయవాదులు పవన్‌కాంత్, వెంకటప్పయ్య, సీహెచ్‌ఓ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ చిట్టిబాబు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

మొవ్వ: స్థానిక వేమూరి సుందర రామయ్య ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ డేను పురస్కరించుకుని శనివారం కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ మాధవి అధ్యక్షతన విద్యార్థిని విద్యార్థులకు డ్రాయింగ్, డిబేట్ పోటీ, ముగ్గుల పోటీ పోటీలు నిర్వహించి వారికి బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపకులు పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: ఎయిడ్స్ నివారణపై విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ వై.శ్రీలత పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ డేను పురస్కరించుకుని శనివారం రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో కళాశాల నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాలేజీ రెడ్ రిబ్బన్ కో–ఆర్డినేటర్ కె.రామయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: హెచ్ఐవీపై గుడ్లవల్లేరు వీవీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రతినిధి వీఎల్ వినోద్‌కుమార్, అధ్యాపకులు డాక్టర్ ఎస్‌కే అమీనాబీ, డాక్టర్ పి.రవీష, నాగూల్ మీరావలీ, రషీద్ పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తుల తాకిడి



స్వామి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల తాకిడి అధికమైంది. భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. స్వామి దర్శనానికి అధికసంఖ్యలో భక్తులు బారులు తీరారు. స్వామి సర్వ పుష్పాలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు.

మహా శివునికి కార్తిక పూజలు

గుడ్లవల్లేరు: మండలంలోని శివాలయాల్లో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని శనివారం స్వామివార్లను భక్తులు దర్శించుకునేందుకు వేకువజామునే బారులు తీరారు. గుడ్లవల్లేరు సిద్ధేశ్వరాలయం, నగరేశ్వరాలయం, విన్నకోట భోగేశ్వరాలయం, కొతవరం గౌతమేశ్వరాలయాల్లో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా కార్తిక వన సమారాధన



పామర్రు విష్ణాలయంలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు



మండవల్లి మల్లేశ్వరస్వామి ఆలయంలో సహస్ర దీపాలంకరణ



భోజనాలు చేస్తున్న బ్రాహ్మణులు

పామర్రు: స్థానిక పాత పోస్టాఫీస్ వద్ద బ్రాహ్మణ కార్తిక వన సమారాధన కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఫణికిషోర్ శర్మ దంపతుల ఆధ్వర్యంలో వచ్చిన బ్రాహ్మణులు సహపంక్తి భోజనాలు చేశారు. సభ్యులు సుబ్బారావు, ఓంకారరావు, చైతన్య ప్రభు, సుబ్రమణ్యం, గంగాధరశర్మ, ఆర్‌కే విశాలక్ష్మి, ప్రసాద్, గిరిజ, పద్మలత పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి ఆలయంలో సహస్ర దీపాలంకణ

మండవల్లి: మండవల్లిలో కొలువై ఉన్న భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి సహస్ర దీపాలంకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్తిక మాసం సందర్భంగా ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: మండవల్లి మల్లేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి ఆలయ అర్చకులు గూడూరు భవాని శంకర్, స్వస్తి వాచకుల ఆధ్వర్యంలో దీపాలంకరణ కార్యక్రమం శనివారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. ఈఓ కొవ్వాడ దివ్యశ్రీ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విష్ణాలయంలో దీపోత్సవం

పామర్రు: స్థానిక విష్ణాలయంలోని కల్యాణ మండపంలో శనివారం రాత్రి కార్తిక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెరుమాళ్ల చంచయ్య, గుప్త, మధు తదితర భక్తుల సహకారాలతో ఆలయంలో ఈ దీపోత్సవాన్ని నిర్వహించారు.